కథా కౌముది

# భూమి పొమ్మంటోంది      తాటిపాముల మృత్యుంజయుడు

**కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో**
**సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.**

ధం బిర్యానీ, పిజ్జా, బర్గర్ల రెస్టారెంట్లు వీధివీధినా తెరుస్తుంటే, ఫిజియోథెరపీ డాక్టర్లు, డయాగ్నస్టిక్ సెంటర్లు సందుసందునా వెలుస్తున్న రోజులివి. ఇరవై ఏళ్లకే నడుం నొప్పులు, ముప్పైఏళ్లకే షుగరు వ్యాధులు ఒంట్లో ప్రవేశిస్తున్నాయి. అలాంటి వ్యాధుల బారిన పడతానేమో అన్న భయంతో మొదట ఇష్టం లేకున్నా శని, ఆదివారాలు హైద్రాబాదులోని నెక్లెస్ రోడ్డు పక్కనున్న ఫుట్ పాత్ పై పరిగెత్తడం మొదలెట్టాను. నెక్లెస్ రోడ్డుకు ఒక చివర లుంబిని పార్కు ఉంటే మరోచివర ఎంటీ ఆర్ గార్డెన్ ఉన్నాయి. నడిచేదారిపై అక్కడక్కడా సిమెంట్ బెంచీలు వేసిఉన్నాయి.

మనిషి ఒక పని చెయ్యాలంటే కనీసం ఒక ప్రేరణ ఉండాలి. వ్యాధుల భయం నన్ను షూ లేసులు కట్టుకొని ఇంట్లోనుండి బయటకు తరిమితే, పరుగుతో అలసిపోయి సేద తీర్చుకొంటున్నప్పుడు నాకు కంపేనీ ఇచ్చే ఆ మనిషి మరో ప్రేరణ. దాదాపు గంటసేపుగా సాగే వ్యాయమంలో నేను ఒక నిర్ణీత స్థలంలో సేద తీర్చుకోటానికి కొంతసేపు ఆగుతాను. సిమెంట్ బెంచీకి ఒక పక్క నేను కూర్చుంటే అతను ఇంకో పక్క కూర్చొని ఉంటాడు. అతనితో కనీసం పది నిమిషాలు మాట్లాడుతాను. మాట్లాడిన ప్రతిసారీ అతని మాటల్లో ఒక కొత్త కోణం ఆవిష్కరింపబడుతుంది.

అతని పేరు ఓబులేసు. ఓబులేసు ఆకాశహర్మ్యాల మధ్యలో పూరిగుడిసెలా ఉంటాడు. మిలమిల మెరిసిపోతున్న నియాన్ లైట్ల మధ్యలో దీపపు ప్రమిదలా అగుపడుతాడు. ఖరీదైన పేయింటింగ్సు మధ్యలో తెల్లకాగితంపై గీసిన పెన్సిల్ బొమ్మలా ఉంటాడు. వెరసి నవీనకాలపు అభివృద్ధితో పెళపెళలాడుతున్న నెక్లెస్ రోడ్డు, అక్కడి పరిసరాలకు అతను సరిపోడని ఇట్టే చెప్పవచ్చు. ఓబులేసు పంచెను మోకాళ్ల పైకి కట్టుకొని గోచీ బిగిస్తాడు. మట్టి కొట్టుకుపోయిన తెల్లలాల్చి చేతులను పైకి మడుస్తాడు. కండువాను చెవులపైగా చుట్టుకొని తలపాగా ధరిస్తాడు. నెరసిన గడ్డంతోను, మాసిపోయిన చర్మంతో దర్శనమిస్తాడు. ఎప్పుడూ అతడు ఏదో ఆలోచిస్తున్నవాడిలా గాలిలోకి చూస్తుంటాడు.అప్పుడప్పుడు దృష్టినిమరలుస్తూ పరిసరాలని గమనిస్తాడు. దూరంగా ఉన్న దేనినో పరిశీలిస్తున్నట్టుగా చూపు నిలుపుతాడు. వచ్చిపోయే మనుషులపై కొన్ని క్షణాలు దృష్టి సారిస్తాడు గూడా.

నా బాల్యం పదేళ్ల వరకు ఊళ్లోనే గడిచింది. అటు తర్వాత, పిల్లల చదువులకోసం అమ్మానాన్నలు పట్నానికి వచ్చారు. ఊరివాళ్లతో పరిచయం అంత కొత్తకాదు, మరీ పాత కాదు. వింతగా అగుపించే ఓబులేసుతో మాట్లాడడం మొదలెట్టాను. మొదట కొన్ని రోజులు నేను అతనిని పట్టించుకోలేదు. కాని, నేను వెళ్లిన ప్రతిసారి ఠంచనుగా అతను అక్కడే కూర్చుని దర్శ్నమిస్తాడు. కుతూహలం పట్టలేక ఒక రోజు మాట్లాడం మొదలెట్టాను.

పరిచయాల తర్వాత 'హైద్రాబాదులో ఏం చేస్తుంటావు?' అడిగాను

అతను నా దిక్కు ఓ జీవంలేని చూపు విసిరాడు. 'ఏం చెయ్యట్లే' నిర్లక్ష్యంగా అన్నాడు.

'ఊళ్లో భూములున్నాయా? వ్యవసాయం చేస్తున్నవా?'

'పిచ్చోడివా?' అన్నట్టుగా నా దిక్కు చూసాడు. ఓ క్షణం నేను అగౌరవంగా ఫీలయ్యాను.

'భూమి ఉంది గాని సాగు చెయ్యట్లే. అయినా ఇప్పుడు ఊళ్లో ఏవుందని? బీడు తప్ప'. ఆ మాట అంటున్నప్పుడు అతనిలో నిర్లిప్తత చోటుచేసుకొన్నది.

నేను పల్లె మొహం చూడక ఎన్నేళ్లయిందో. ఇంగ్లీషు మీడియం చదువులు. పోటీ పరీక్షల పరుగులు, ఐటీ జాబుతో వచ్చే కారు, అపార్టుమెంటు హంగులు, పిల్లల్ని ఇంటర్నేషనల్ స్కూల్లో చేర్పించడంలాంటి షోకులతో పూర్తిగా మునిగితేలుతున్నాను.

'మీరంతా వెక్కిరిస్తున్నట్టుగా ఎర్రబస్సు ఎక్కి వచ్చినోళ్లం. ప్రతిరోజు పొద్దున పొట్టచేత పట్టుకొని ఎక్కడ కూలిపని దొరుకుతుందా అని అడ్డామీదకు చేరుకుంటాం. హైటెక్ సిటీలో మీ అభివృద్ధికి పనికొచ్చే బిల్డింగులు కట్టుతాం. పంటచేను కాపలా కాయాల్సిన మా బతుకులు మీ అపార్టుమెంట్ల ముందు కాపాలా కుక్కలు అయ్యాయి ' అంటున్న అతని మాటలు ఒళ్లంతా సూదుల్లా పొడిచాయి.

వెంటనే నాకు మా అపార్టుమెంటులో ఉండే వాచ్ మెన్ గుర్తుకొచ్చాడు. సన్నకారు రైతు. నీటికొరకు పోలంలో మూడుసార్లు బావి వేయించి విఫలం చెందాడు. వేరే ఆశ, సహాయం లేక భార్య పిల్లల్తో పట్నం చేరుకొన్నాడు. భార్య కొన్ని ఆపార్టుమెట్లలో పాచిపని చేస్తుంది. బేసుమెంట్లో ఓ చిన్న గదిలో ఇద్దరు చిన్నపిల్లలతో కాపురం. అలాగే, మనమంతా చాతి విరుస్తూ గొప్పగా చెప్పుకొంటున్న హైద్రాబాద్ విమానాశ్రయం ఊళ్ల తరలి వచ్చిన వెలాది కుటుంబాల వల్లే సాధ్యమయింది.

ఇంకో రోజు మా మాటల్లో సినిమాలు గురించి దొర్లాయి.

'సినిమాలు చూస్తావా?'

'ఆ, అప్పుడప్పుడు మా వూరి మండలం సినిమా హాల్లో'

'ఈ మధ్య ఏం సినిమా చూసావు?'

'ఏ సినిమా చూస్తే ఏముంది? మా జీవితాలకి ఏం సంబంధం లేదుగా. మాకు ఆ సినిమాలన్ని వింతగా అనిపిస్తాయి. సినిమాలో అన్నీ ఇంగ్లీషు మాటలే. చివరకు సినిమా పేర్లు కూడా తెలుగులో వేస్తే ఒట్టు. కాఫీలు తాగడాలు, కార్లలో తిరగడం, కురచ బట్టలు వేసుకోవడం, క్లబ్బుల్లో తాగడం, విదేశాల్లో పాటలు పాడుకోవడం. ఇవేగా మీరు తీసే సినిమాలు. వీటిల్లో ఏ విషయాన్ని మా జీవితాలకి అన్వయించుకోవాలి? పచ్చని పొలాలు, పిల్లకాలువలు, మా కట్టుభొట్టు, ఆచారవ్యవహారాలు మీకెప్పుడు ఆనాయని సినిమాల్లో పెట్టుకోడానికి. ఏదో నవ్వులాటకి, పేరు గొప్పకి తప్పిస్తే.'

అలా మాట్లాడుతున్నప్పుడు నా చూపులు పక్కనే ఉన్న పీవీ ఆర్ థియేటర్ల దిక్కు అప్రయత్నంగా మళ్లాయి.

'మీదేమో మల్టిప్లెక్స్ సంస్కృతి. మేమేమో సి సెంటర్ల ప్రేక్షకులం. మా పిల్లలు అభిమాన సంఘాలు పెట్టాలి. మొదటిరోజు మొదటి ఆట టికెట్టు కొరకు ప్రాణాలు ఇవ్వాలి. మీరు తీసే సినిమాలకు మాకు ఏమాత్రం సంబంధం లేకున్నా మేం మాత్రం సిలిమా విజయవంతం చేయాటనికి కృషి చేయాలి '. అలా అంటున్నప్పుడు అలసట అతని ముఖంలో కనిపించ లేదు కాని, చూడగలిగే కనులకు అతని చూపుల్లో తప్పక కనిపిస్తుంది.

ఓబులేసు ఎంతవరకు చదువుకున్నాడో తెలియదు కాని ఏ విషయం పైన అయినా అతను వెలిబుచ్చే అభిప్రాయాలు ముక్కుసూటిగా, నిష్కర్షగా ఉంటాయి. ఇంటికెళ్లినా సాయంత్రం అప్పుడప్పుడూ గంభీరమైన అతని ముఖం నాకు గుర్తుకు వస్తూనే ఉంటుంది. ఆఫీసులో కూర్చుని పని చేస్తున్నా లోతైన అతని కళ్లు నన్ను అనుసరిస్తున్నట్టుగా అనిపుస్తుంది.

మరోరోజు అతనితో మాట్లాడుతున్నపుడు ప్రజా సంఘాల నాయకులు, ఇతర సాంస్కృతిక, సేవా సంస్థలు రైతుల సమస్యలపై అవగాహన కల్పించడం, పల్లె జీవితాల ఎగుడుదిగుడులను ప్రజాదృష్టికి తేవడం మా మాటల్లో దొర్లాయి.

'మా పల్లెలు, మా జీవితాలు, మా సమస్యలు మీకు కథలు, కవితలు రాసుకోడానికి పనికొస్తున్నాయి. పాటలు కట్టి స్టేజీలెక్కి పాడుకోటానికి బాగుంటాయి. పండుగ సంబురాలు చేసుకోటానికి, సభలు, సత్కారాల్లో శాలువలు కప్పుకోటానికి, బిరుదులు ప్రదానం చేసుకోటానికి పనికి వస్తాయి. అంతేగాని మాకుగాని, మా పల్లెలకు గాని ఒరిగిందేమి లేదు ' అని పుల్ల విరిచినట్లు మాట్లాడాడు.

ఐదేళ్ల మా అబ్బాయి చదువుతున్న కాన్వెంట్ స్కూలు పిల్లలను రాబోయో 'ఛాలెంజింగ్ వరల్డు ' కు తయారు చేస్తున్నామని డబ్బా కొట్టుకుంటూ, ఎక్కడ లేని ఫీజులు వసులు చేస్తున్నప్పుడు, మన దేశానికి జీవనాధారమైన రైతును పట్టించుకునే నాథుడే లేడంటే నమ్మశక్యం కావడం లేదు.

'ఇవన్నీ మాట్లాడుకోవడం అనవసరం. ఏం జరగబోతుందో తెలుస్తునే ఉందిగా. కొంతకాలానికి మాబోటి రైతులు పల్లేల్లో ఒక్కడు మిగలడు. మా తరంతోనే రైతు జాతి అంతరిస్తుంది. ఈ కట్టు, బొట్టు, వేషధారణ, పద్ధతులు ఇవేమి ఉండవు. పుఇస్తకాల్లో రాసుకున్న చరిత్రగానే మిగిలిపోతుంది.' అంటూన్న అతని ముఖంలోనికి చూడటానికి భయం వేసింది. అయినా ధైర్యం తెచ్చుకొని చూసాను. మరి, ఆ లోతైన కళ్ల వెనకాల జరుగుతున్న అల్లకల్లోలం మాత్రం వినిపించలేదు, కనిపించలేదు. అదే, ఓబులేసుతో వచ్చిన ఇబ్బంది. చాలా అర్ధవంతంగా మాట్లాడుతాదు గాని, ముఖంలో భావాలేమి చూపడు.

శక్తిని కూడగట్టుకొని నెమ్మదిగా లేచాను. అతని వంక చూడకుండా నెమ్మదిగా అక్కడినుంచి నడిచాను. కారులో ఇంటికి చేరాను. మా అబ్బాయి నాకోసమే చూస్తున్నట్టున్నాడు. నన్ను చూడగానే సంతోషంతో 'డాడీ, నిన్న మేము స్కూలునుండి శిల్పారామం టూర్ కు వెళ్లాం కదా. మా టీచర్ ఆ ఫోటోలను అమ్మకు పంపించింది చూడు ' అను చూపెడుతూ తనకు తెలిసింది చెప్పడం మొదలెట్టాడు. వాటిల్లో గ్రామీణ జీవనానికి సంబంధించిన ఫోటోలు కొన్ని ఉన్నాయి.

అందంగా కట్టిన గుడిసెల్లో కమ్మరి వాళ్ళు ఇనుముముట్లు పనిచేస్తున్నట్టు, కుమ్మర్లు మట్టితో కుండలు చేస్తున్నట్లు, ఇంటిముందు పశువులు, ఆ ఇళ్లలో ఉండే మనుషుల బొమ్మలు అందంగా తయారు చేసి నిలెబెట్టారు. వాటి గురించి మా అబ్బాయి ఎంతో సంతోషంగా చెప్పుకుపోతున్నాడు. ఆ వృత్తుల్లని ఇప్పుడు వూళ్లలో దాదాపుగా అంతరించిపోయినవే.

వెంటనే, చివరగా ఓబులేసు మాటలు గుర్తుకు వచ్చాయి. అంటే కొన్నేళ్లకి ఓబులేసు బొమ్మ, అతని ఇల్లు, మిగతా సామాన్లు ఇక్కడ చోతుచేసుకుంటాయన్న మాట. అది తల్చుకోగానే వెన్ను జలదరించింది. ఏమీ మాట్లాడకుండా లేచి బెడ్ రూంలోకి వెళ్లుతున్న నా వెనకాల 'డాడీ, డాడీ' అంటూ వచ్చాడు. ఆ పిలుపు పట్టించుకోకుండా నేను తలుపు వేసుకున్నాను.

★★★

మా ఆఫీసులోని మూడో అంతస్తులో ధారళంగా మీటింగు కొనసాగుతోంది. గాజుగోడలతో నిర్మించిన విశాలమైన గదిలో తళతళలాడుతున్న పెద్ద టేబుల్, దాని చుట్టు ముప్పై వరకు మెత్తని కుర్చీలు వేసి ఉన్నాయి. అమెరికానుండి వీడియో కాంఫరెన్సులో బిజినెస్ టీం మెంబర్సు రాబోయే ప్రాజెక్ట్ గురించి వివరిస్తున్నారు. మేమంతా వేడి కాఫీలి తాగుతూ, బిస్కట్లు తింటూ శ్రద్ధగా వింటున్నాము.

"మన కంపెనీకు ఈ ప్రాజెక్ట్ చాలా ప్రతిష్ఠాత్మకమైనది. కాబట్టి సరైన ప్రణాలికతో పనిచేస్తూ, బడ్జెట్ దాటకుండా, డేట్స్ మిస్సవకుండా దీక్షతో పనిచేసి ఆర్నెల్లలో మన ప్రాడక్టును మొదట ఇండియాలో లాంచ్ చేయాలి. అక్కడి తొలిదశలోని జయాపజయాలను బేరీజు వేసుకొని మన ప్రాడక్ట్ ని మిగతా ఆసియా దేశాల్లొ విడుదల చేయవచ్చు. మొదటగా ఇండియాను ఎందుకు ఎన్నుకున్నామంటే ఇండియాలో మధ్యతరగతి కుటుంబాల సంఖ్య

మరియు వారి వార్షిక ఆదాయం అనూహ్యంగా పెరిగిపోతున్నది. ఇందుకు కారణం టెక్నాలజీ డెవలప్మెంటే. ఇంటర్నెట్ ఒళ్లో, అరచేతిలో ఉండేసరికి ముఖ్యంగా యువత ఖర్చుపెట్టే విధానంలో కూడా గణనీయమైన మార్పులు వచ్చాయి. కాబట్టి, ఈ విషయంలో మన కాంపిటీటర్సు తేలుసుకొని తేరుకొనేలోగా మనం ఈ మార్కెట్ ను ముఖ్యంగా మొదట నాలుగు పెద్ద పట్టణాల్లొ ఆక్రమించుకోవాలి..." చెబుతున్నాడు అటువైపు నుండి బిజినెస్ వైస్ ప్రెసిడెంట్.

'మళ్లీ భారతదేశాన్ని టార్గెట్ చేస్తూ, యువతని ఆకర్షిస్తూ మరో ప్రాజెక్ట్ మొదలవబోతున్నది. అవును, ఎవరి జేబులో డబ్బులుంటే, వారిపైనే అన్ని బిజినెస్ ప్రయోగాలు. డబ్బులేని పేదవాని గురించి, ఊళ్లో ఉండే రైతుల గురించి ఎవరు పట్టించుకొంటారు...'. నా ఆలోచనలు పరిపరివిధాలుగా సాగుతున్నాయి. తల దిమ్మ తిరుగుతున్నది.

"ఎవరికైనా, ఏవైనా ప్రశ్నలున్నాయా?" అడుగ్తున్నది బిజినెస్ టీం.

"మరి ఓబులేసో?" నా నోట్లోంచి ప్రయత్నంగా ప్రశ్న వెలువడింది. తెలుగులో అడిగిన ప్రశ్న అమెరికా వాడికి అర్థం కాలేదు. నాతో పాటు కూర్చున్న కొందరు పెళ్ళున నవ్వారు. మరికొందరు విస్మయంగా చూసారు.

"ఫణీంద్ర, నువ్వేం మాట్లడుతున్నావో నీకు తెలుసా?" మా టీం లీడర్ అడిగాడు.

"అవును, తెలిసే అడుగుతున్నాను. మరి, నా ఓబులేసు మాటేంటీ?' మళ్లీ అదే ప్రశ్న సునాయాసంగా అడిగాను. నా మాట మీద నాకు వశం తప్పింది.

"జోక్స్ కు ఇది సమయం కాదు. ఇది చాలా సీరియస్ ప్రాజెక్ట్" అన్నాడు లీడ్.

"హూ కేర్స్ అబౌట్ దిస్ ప్రాజెక్ట్" చేతిలోని పేపర్స్ ను అప్రయత్నంగా గాల్లోకి విసిరాను.

"నీ ప్రవర్తన నీ ఉద్యోగానికే ముప్పు కావచ్చు" అంటూ నెమ్మదిగా హెచ్చరించాడు.

"ఎగైన్, ఐ డోంట్ కేర్ మై జాబ్. విదేశాల వాళ్లకు మన రైతుల గురించి ఎలాఘు అవగాహన లేదు. అలాగే మనం, మన ప్రభుత్వాలు పట్టించుకోకుండా ఉంటే ఓబులేసులాంటి రైతుల గతి ఏంటి? వాళ్లు ఈ భూమి

మీదనుండి అంతరించి పోవల్సిందేనా?"

అందరూ నన్ను పిచ్చివానిలా చూస్తుంటే విసురుగా మీటింగ్ హాల్లోంచి బయటకు నడిచాను.

ఉన్న పళంగా ఓబులేసును చూడాలనిపించింది. కారును నెక్లెస్ రోడ్డు వైపు నడిపించాను. ఓబులేసు కూర్చునే బెంచి ఖాళీగా ఉంది. చుట్టూ చూసాను. దూరంగా అతను ఎవరితో మాట్లాడుతూ కనిపించాడు. గబగబా అటు దిక్కు నడిచాను.

"అయ్యా, మీ ఇంట్లో ఏదైనా పని ఉందా? చేసి పెడతాను" ఎవరినో అడుగుతున్నాడు. ఆ వ్యక్తి దగ్గరనుండి జవాబు రాలేదు.

"సారూ, అన్నం తిని చాలా రోజులైంది. ఆకలేస్తాంది. కొద్దిగా ధర్మ చెయ్యండి" ఇంకెవరినో అభ్యర్థిస్తున్నాడు.

'ఓబులేసుకు ఈ స్థితి రావడమేంటి? వరి అన్నం పండించే చేతులు చివరికి బిచ్చమెత్తుకుంటున్నాయా? ఇతరుల ముందు చేయిసాచి అడుక్కోవటం చాలా హీనస్థితి. మరి అలాంటి స్థియికి చేరుకున్నాడా?'. నాకు కడుపులో తిప్పినట్టయింది. భళ్లున వాంతి చేసుకోబోయాను.

★★★

ఒక్కసారిగా నిద్రలోంచి మెలకువ వచ్చింది. చటుక్కున మంచంలోంచి లేచి కూరుచున్నాను. నుదిటిపైన, మెడపైన చెమటలు పోసాయి. అరచేతులు చల్లగా ఉన్నాయి. ఒంట్లో సన్నని వణుకు ప్రారంభమైంది. 'అంటే, ఇప్పటి దాకా ఆ మీటింగ్లో గొడవ, ఓబులేసు బిచ్చమెత్తుకోవడం' అంతా కల్పన అన్న మాట. నిజం కానందుకు సంతోషమేసింది. హాయిగా ఊపిరి పీల్చుకొన్నాను. ఉన్న ఫళంగా ఓబులేసు దగ్గరకు వెళ్లాలనిపించింది.

ఐదు నిమిషాల్లో తయారై షూ లేసైనా సరిగ్గా కట్టుకోకుండా బయటకు వెడుతుంటే 'ఉదయపు నడకకు ఎప్పుడు లేని అంత తొందరేంటీ? కాఫీ తాగెళ్లొచ్చుగా?' ప్రియసఖి అడుగుతున్న ప్రశ్నకు జవాబివ్వకుండా నెక్లెస్ రోడ్డు చేరుకున్నాను.

ఆశ్చర్యం! ఓబులేసు కూర్చునే సిమెంట్ బెంచీ ఖాళీగా ఉంది. క్రమం తప్పకుండా రోజు అక్కడ కూర్చునే వాడు ఈ రోజు ఎందుకో రాలేదు. ఒళ్లంతా అశక్తత ఆవరిస్తుంటే నేను ఆ బెంచిపై చతికిలపడ్డాను.

'ఓబులేసు ఇంకొద్ది సేపట్లో వస్తాడులే' అన్న ఆశ ఒకవైపు, 'ఏమయ్యిందో ఏమో? అసలు రాడేమో?' అన్న భయం మరోవైపు, ఈ రెండు ఆలోచనల మధ్యలో నా మనసు గిలగిలలాడింది.

***

Click here to share your comments on this story